కథ-జీవితం

శివల జగన్నాథరావు

'గాలీ వాన'లాగా వచ్చేడు మురళి!

వర్ధనం తలుపు తీస్తూనే ఆశ్చర్యపోయి, ఆ మాటే అంది- "ఏమిటిలా గాలీ వాన లాగా వచ్చేవేమిటి, మురళీ!"

మురళి ముఖంలో మందహాసం మబ్బుల్లోంచి ఇబ్బందిగా తొంగిచూసే చంద్రుడిలా ద్యోతకమయింది వర్ధనానికి.

"అవును ... నీతో అత్యవసరంపడి వచ్చేను..." అన్నాడతను.

"ఏమిటీ?! నాతోనా!" వర్ధనం విస్మయం నిండిన కళ్ళతో నవ్వింది.

మురళి చేతిలోని ఎయిర్ బాగ్ ఆగదిలో టేబిలుమీద వుంచి, చుట్టూ చూస్తూ "మీ ఆయనేరీ? ఇంకా రాలేదేం ఆఫీసు నుంచి?" అడిగేడు.

వర్ధనం గబగబా అంది- "ఆయన కాంపు కెళ్ళారు ... సరేగాని నువ్వు బట్టలు మార్చుకో! పెరట్లో నీళ్ళోసుకుందువుగాని, రా! ఆనక కాఫీ ఇమ్మంటావా? ఇప్పుడే ఇవ్వనా?"

"ఇప్పుడే ఇవ్వు..."

వర్ధనం లోనకెళుతూంటే వెనకనించి చూస్తూ నిట్టూర్చేడు మురళి.

చిన్ననాటి స్నేహితురాలు వర్ధనం! కాకినాడలో వాళ్ళదీ, తమదీ రెండు ఇళ్ళూ పక్కపక్కనే వుండేవి. ఆడుతూ పాడుతూ పెంచుకున్న స్నేహాన్ని వయసు వచ్చేక 'వలపుగా' పండించుకున్నారు. కాని...కథ మామూలే అయిపోయింది ఇక్కడానూ! 'కులం' అడ్డు

అయింది! పెద్దవాళ్ళ అభ్యంతరానికి తమ ప్రేమ నిలవలేకపోయింది!!

వర్ధనం పెళ్ళయిపోయింది! ఈ వూరికి మకాం మారింది. తను కాకినాడలో డిగ్రీ సంపాదించి, ఓ గుమాస్తాగిరీ కూడా సంపాదించేడు.

"ఎంత అన్యాయం! నీకు పెళ్ళయిందన్న కబురే నాకు రాసేవుకాదు!?" అంది వర్ధనం కాఫీ తెచ్చియిస్తూ.

"మరెలా తెలిసింది నీకు?" అడిగే డాత్రంగా మురళి.

"నా స్నేహితురాలొకామెకి మీ ఆవిడ చుట్టమేనుట...నా ఫ్రెండు నీ పెళ్ళికి వెళ్ళిందట..."

ఓ గుక్క తాగి, ఇక తాగలేనట్టు కాఫీగ్లాసు టేబిలుమీద పెట్టేసేడు మురళి.

"అదేం ? వేడి చాల్లేదా?"

"చాలా వేడిగా వుంది..."

"పంచదార ఇంకొంచెం వెయ్యనా?"

"ఆహఁ...వద్దు..."

"మరి?"

వర్ధనం అతన్ని చూస్తూ "నీ పెళ్ళి వూసు ఎత్తేసరికి కాఫీ సయించలేదా?" అంది కొంచెం నవ్వి.

మురళి దొరికిపోయిన దొంగలా యిబ్బందిగా చూశాడు.

"అసలు నేనొస్తే నీకేవిటి అడ్డు, నీ పెళ్ళిలో ? ఎంత స్నేహితురాలిని అయినా, పెళ్ళి అయిపోయిన దానినే గదా? నీ పెళ్ళి చూశామని ఎంత ఉబలాట పడ్డానో, నీకేం తెల్సు?"

"ఆ వుబలాటం తీరిపోలేదా నీకు? నీ స్నేహితురాలు ఏం చెప్పలేదా, నా పెళ్ళి విశేషాలు?"

వర్ధనం అదోలా నవ్వి, "నీకు ఆ అమ్మాయి ఇష్టంలేదుటగదూ? పీటల మీదకూడా కోపంగానే వున్నావుట! ఏఁవిటో! ఇలాంటి గుంపుసింపులు దాచుకుందామన్నా దాగవు!" అంది.

"అవును! దాగవులే...చెప్పేస్తున్నా పూర్తిగా విను! గీతని పెళ్ళిచూపుల్లోనే తిరస్కరించేను. కానీ, మావాళ్ళు బలవంతంగా నా కంటగట్టేరు..."

"నీ మాటేం బావోలేదు...నువ్వేం పాల్తాగే పాపాయివా, బలవంతంగా పాలంసీసా నోట్లో కుక్కి, ముక్కు మూసి తాగించడానికి?"

మురళి సిగ్గుపడిపోతూ, "నేను పాపాయినికాను...కాని ఈ పెద్దవాళ్ళు పిల్లల్ని వయసొచ్చినా, పాల్తాగే పాపాయిల్లాగే ట్రీట్ చేస్తామంటారు, అంత బలవంతంగానూ, అంత ఫోర్సు తోనూ! మన పెళ్ళివిషయంలో ఏం చేసేరు? అప్పుడు నేనూ, ఇన్ని మాట లంటున్న నువ్వూ ఏం చెయ్యగలిగేం చెప్పు?" అన్నాడు.

" నా వూసొదిలేయ్! నే నాడదాన్ని! నే నెంత ఫోర్సు చేసినా లాభం వుండదు! నువ్వు మగాడివి! నీకుండాలి ఫోర్సు!

వు(హుం! ప్చ్! నువ్వెప్పుడూ ఒక్కలాగే వున్నావు!!"

"వర్ధనం! నేను నిన్ను నమ్ముకుని నీ సలహాకోసం వస్తే, నువ్వు మాటలతో నన్ను చావగొడ్తున్నావిదేం బావులేదు.."

"నన్ను నమ్ముకుని వచ్చేవా?! అరే! ఇంక నా మీద నమ్మకాలు, విశ్వాసాలూ నీకు ఎందుకటా? నేనేం చెయ్య గలననిటా??"

"నా దాంపత్యం విషయంలో..."

"వూ(...చల్లకొచ్చి ముంత దాచటం దేనికో? ఆగిపోయావేం? పూర్తిగా చెప్పు!"

"నాకు గీత యిష్టంలేదు..."

"ఓసారి చెప్పేవు..."

"గీత మొహం చూస్తేనే నా కడేవిటో...చిరాకూ, కోపం పుట్టుకొచ్చే స్తాయ్! యింక తనతో ఎట్లా గడిపేదీ? మాటలే కలవందీ మనసే విటి? మనువేమిటి?"

"అయితే?!..."

"జంతువులా నేను సంసారం చెయ్య లేను! ఇద్దరం ఎడాపెడగానే వున్నాము"

వర్ధనం గట్టిగా నిట్టూర్చింది. "నేను బాధపడుతున్నాను..." అంది.

మురళి ఆమెని ఆశగా చూస్తూ "నా మీద నీకు ఆమాత్రం అభిమానం ఉందంటే చాలు!" అన్నాడు.

"నేను బాధపడుతున్నది గీత గురించి మురళీ!"

"గీత గురించా? ... " ముఖం ఎర్రగా చేసుకున్నాడతను. "ఎప్పటి నుంచో అనుబంధం వున్న నా గురించి ఆరాటపడక, ముక్కూ మొహం తెలీని మనిషికోసం బాధపడిపోతున్నావేం?!"

"గీత నాకు అపరిచితురాలె కావచ్చు! గీత సాటి ఆడది, మురళీ! గీత పరిస్థితి చాలా అధ్వాన్న స్థితిలో వుంది! నా జాతి మనిషిగా ఆమె గురించి జాలిపడడం, బాధపడడం నా కనీస ధర్మం!!"

"అధ్వాన్న స్థితిలో నేనూ వున్నాను!"

"నీ కేం మగాడివి! సమాజం ఎంత పురోగమించుతున్నానని విర్రవీగు తున్నా, మనిషికో రూలు ఇది పాటి స్తూనే వుంది! మీ మగాళ్ళ ధీమా, మీ ఫోజులు చెల్లుతూనే వున్నాయిగా?"

మురళి విసుక్కున్నాడు. "నా మొహం ధీమా! నా పరిస్థితి అసలు నీకేం తెలుసు! గీతతో నేను కాపురం చెయ్య లేదని, 'నేను మగాడిని కానంటూ' అందరితో కసిగా చెబుతోంది! దాంతో నే నందరి దృష్టిలో వుత్త పనికిమాలిన వెధవగా జమ అయిపోయేను! గీతని మంచిచేసుకొం కి నేను తనతో కాపురం చెయ్యాలా? లేక విడాకులు తీసు కోవాలా?..." అంటూ ఆగిపోయాడు.

"ఈ ప్రశ్నలు అడగడానికేనా

వచ్చేవు?" వర్ధనం సాలోచనగా చూస్తూ అంది

"ఇది నా జీవిత సమస్య, వర్ధనం! నా భవిష్యత్తు ఆ రెండు ప్రశ్నల మీదే ఆధారపడి వుంది!"

వర్ధనం ఫకాల్న నవ్వింది. ఆగి మళ్ళా నవ్వింది. మళ్ళా నవ్వింది.

"వర్ధనం!" మురళి వుడుకెత్తి పోయేడు.

"నీ కంత ఎగతాళిగా వుందా, నన్ను చూస్తే?"

వర్ధనం నవ్వినందువల్ల పైట జారి పోయిందికూడా చూసుకోలేదు. నవ్వుతో కళ్ళలో చిప్పిల్లిన నీటిని చేత్తో తుడుచుకొంటూంటే, మురళి ఆమె ఎగసి ఎగసి పడుతూన్న వక్షోజాల్ని, ఆడదాన్నెరగనివాడిలా చూడసాగేడు కళ్ళు విప్పార్చి

"మురళీ! అలా ఎగిరిపడకు! నీ రెండు ప్రశ్నలు వింటూంటే నాకు నవ్వు వచ్చింది. కాకపోతే ఏమిటా ప్రశ్నలు? నన్నే అడిగేవా? ఇంకెవరినైనా అడిగేవా అన్సర్లు చెప్పమని?"

మురళి మాట్లాడలేదు

వర్ధనం అప్పటికి తనవంక చూసుకుని పైట సర్దుకొంది. మురళి దగ్గరగా వెళ్ళి "కోపం తగ్గలేదా మురళీ! ఇలా చూడు! ఇంత పెద్దవాడి వయ్యేవు గాని నీలో ఇంకా చిన్నతనం పోలేదోయ్! నీ భార్యకి సంబంధించిన సమస్యలు పైవాళ్ళతో చెప్పుకుంటే నీ ముందు ఆలకించినట్టున్నా! వెనకాల నవ్వుకొంటారు!" అంటూ అతని వీపుమీద లాలనగా చెయ్యి వేసింది.

"నేను అందరితో చెప్పలేదు. నువ్వు బాల్యస్నేహితురాలివని, నేనంటే నీకు

చాలా చాలా ఇదని...అనుకుని వచ్చేను గాని......"

వర్ధనం పెదవులు విడకుండా నవ్వింది. ఆ నవ్వు!...అదంటే మురళికి ఎంతో యిష్టం! చిన్నప్పుడు వర్ధనం అలా నవ్వితే తను అయిసయిపోయి, తన దగ్గర ఏ వస్తువుంటే అది 'అచ్చంగా' ఇచ్చేసేవాడు! ఎదుగూతున్న వయసులో, ఎవ్వరూ వుండని ఏకాంతంలో 'ముద్దులు' కూడా ఇచ్చేడు! ఆ నవ్వు...మళ్ళా... ఇన్నాళ్ళకి!? మురళి దిగాలుపడిపోయేడు. ఇప్పుడు వర్ధనం అట్లా నవ్వితే...తను? ... గుండెలు ఝల్లుమన్నది. ఇద్దరికీ ఒక తెర వుందిప్పుడు!!

మురళి స్నానం చేశాక, ఇద్దరూ కూచుని భోజనం చేశారు. మురళి ఆమె వంట చాలా బావుందంటూ ఎక్కువే తిన్నాడు.

"ఇలా నీ దగ్గర కూచుని, నువ్వు వడ్డిస్తోంటే తినే అదృష్టానికి కనీసం ఇప్పుడైనా నోచుకున్నాను!"

వర్ధనానికి అతనలా అంటే చప్పున మనస్సు రాగరంజితమైంది. ఎదురుగా వున్నా, అతను ఒకప్పుడు తన ప్రేమికుడు!! అది కాదు లేదని అనలేని నిజం!!

"నీ జీవితం ఇలా అయినందుకు నాకు విచారంగా వున్నది మురళీ!" అంది నిట్టూర్చి.

"పోనీలే! ఇంత సేపటికయినా నా మీద నీకు జాలి కలిగిందదే చాలు!"

"అదేం మాట మురళీ! నేను నీ మీద ద్వేషంతో నిండివున్నాననుకొంటున్నావా?! అలా అయితే నిన్ను నా యింట్లోకే రానివ్వను తెల్సా?"

"నే నీ రాత్రికి ఇక్కడే వుంటాను సుమా! మీ ఆయన కాంపు కెళ్ళారని నన్ను పొమ్మనకు! రేపెలానూ పోతాను..." మురళి భయం నటిస్తూ అన్నాడు.

"అయితే నా పక్క ఆ గదిలో వేసుకుంటాను ... నువ్వు ఇదిగో ఈ మంచంమీద పడుకో!"

"మీ ఆయన ఓ రాత్రివేళ వస్తే?.."

"ఫర్వాలేదు! మేం ఏదోలా సర్దుకొంటాములే! అతిధికి అమర్యాద చెయ్యం!"

మురళి మంచంమీద కూచుని అన్నాడు: "నా కివాళ రిలీఫ్‌గా వున్నది వర్ధనం! నా మనసులోని ఆ బాధ నీతో చెప్పేసుకుంటే ... నీ సమక్షంలో గడిపితే......"

వర్ధనం ఆవులించి వెళుతూంటే "ఇంతకీ నా ప్రశ్నలకి జవాబు చెప్పేవు కాదు! నేను రేపు వెళ్ళిపోవాలి!" అన్నాడు.

"రాత్రి ఆలోచించి, రేపు చెబుతాను..." అని నవ్వి వర్ధనం వెళ్ళి పడుకుంది.

మురళికి నిద్ర రావడంలేదు. టేబిలు మీదున్న తన రిస్ట్‌వాచ్ తీసి టైము చూశాడు. పదిన్నర! ఆ గదిలోకి చూశాడు. తలుపు సగం వేసుంది. వర్ధనం తలుపు పూర్తిగా ఎందుకు వేసుకోలేదు? తనమీద సగం నమ్మకం వుంచిందా? సగం తలుపు తెరిచి!... పక్కమీద అటు యిటు దొర్లాడు. వుఁహు! కళ్ళు మూతలు పడడంలేదు. మనసు మూత పడడంలేదు. ఆలోచనలు!! జరిగిపోయినవి!! గీతతో పెళ్ళి. గీతతో కార్యం గదిలో, తన చిరాకు...గీత కన్నీళ్ళు. తర్వాత...గీత తనమీద అందర్తో చెడ్డగా చెప్పడం... తనకి మరింత ఆగ్రహం, వుద్రేకం!! తండ్రి...తల్లి. అందరిమీద ప్రళయ రుద్రుడే అయ్యాడొకసారి! తన జీవితాన్ని నాశనం చేశారని ... తల్లి ప్రతిమాలింది. జరిగిందేదో జరిగింది. ఆ పిల్లని అన్యాయం చెయ్యకంది. విడాకులిచ్చేస్తానన్నాడు. బంధువులంతా వెలివేసినట్టే చూశారు తను అలా అంటే!? "మగాడివి కావు గనకనే విడాకులిచ్చేస్తానంటున్నావ్!" అనేశాడు గీత తండ్రి! ఆ మాటతో తనకి పౌరుషం పెరిగిపోయింది. కాని అప్పటికే అలుసై పోయేదే! అర్జెంటుగా శలవుపెట్టి ఇలా వచ్చేడు! మనసుకి రిలీఫ్‌కోసం!! తన ఆవేదన బాల్యస్నేహితురాలితో చెప్పు కోవడంకోసం! వర్ధనంనుంచి ఏదో సలహా తీసుకొందికి......

మురళి ఇబ్బందిగా లేచి కూచున్నాడు, పక్కమీద. లోపల అసంతృప్తి...తినేస్తోంది! సుఖంలేదు. తృప్తిలేదు. సరదాలేదు. సంతోషం లేదు! ఇవన్నీ లేకపోవడానికి కారణం తనకి ధైర్యం లేకపోవడమే! తెగింపు లేకపోవడమే! వుంటే వర్ధనాన్ని పెళ్ళి చేసేసుకుని హాయిగా వుండేవాడిప్పుడు! వర్ధనం! అప్పటికీ యిప్పటికీ ఒక్కలాగే వుంది! శరీరంలో బింకం అలానే వుంది. మురళి మనసులో.. ఇందాక వర్ధనం నవ్విన దృశ్యం మెదిలింది. పైట జారి ఎగిరెగిరిపడుతున్న వక్షం......

మురళి కూచోలేక లేచి నుంచున్నాడు. వొంట్లో రక్తం వురకలేస్తూంది. నరాలు పొంగుతున్నాయ్. ఆలోచనలన్నీ ఒకే వైపు వున్నాయ్ ఇప్పుడు! కావాలి కావాలి! ఈ అసంతృప్తి దేహానికి... ఈ అశాంతపూరిత హృదయానికి ... వుపశమనం...

అడుగులో అడుగేస్తూ అతను వర్ధనం గది దగ్గరకు వెళ్ళేడు. తలుపు ఎడంలోంచి చూశాడు. వర్ధనం పట్టె మంచంమీద వెల్లకిలా పడుకునుంది, చేతులు రెండూ అటూ ఇటూ చాచి. వుచ్ఛ్వాస నిశ్వాసాలతో వక్షం ఎగసి పడుతూంది. మురళి తలుపు తోశాడు. గదిలోకి నడిచేడు. వుద్రేకంతో వొళ్ళు వొణుకుతోంది. వూపిరి వేగంగా వస్తోంది. మంచం దగ్గరికి వెళ్ళేడు.

వర్ధనం గాఢనిద్రలో వుంది! పమిట పక్కమీదికి జారింది. చీర మోకాళ్ళ వరకూ స్థానం మారింది. నిగ్రహం కోల్పోయేడు మురళి. వొంగి, వర్ధనం పెదవులతో తన పెదవుల్ని కలిపాడు. వివశత్వంతో గాఢంగా చుంబించాడు. వులిక్కిపడి కళ్ళు తెరిచింది వర్ధనం.

మురళి!!

"మురళీ!!" చిన్న కేక వేసింది. అతన్ని విడిపించుకోబోతూ. మురళి విడివడలేదు ఆమెని అల్లుకుపోతున్నాడు! "ఛీ! తప్పు! వొదులు!"

"వర్ధనం! కావాలి వర్ధనం...నువ్వు నాక్కావాలి" అంటూ అతను గాఢంగా ఆమెని పెనవేసుకుపోతున్నాడు.

"ఛీ! కావాలిట!! నేనా? ఇప్పుడా?! నీకు సిగ్గులేదా? నాకు భర్త వున్నాడు!" "వొదులూ! వూ...!"

"వుంటే వుండనీయి! ఇక్కడిప్పుడు లేడుగా?"

వర్ధనం బలవంతంగా లేస్తూ "నీకు కావల్సింది వర్ధనం కాదు! ఆడది! పరాయి ఆడది! నీ భార్య తప్ప ఏ ఆడదేనా నీకాక్కావాలి, ? ఏం ఛీ!" ఛీత్కారం చేసింది.

"నువ్వే నువ్వే కావాలి వర్ధనం!... ఇంకెవరూ వద్దు నాకు! ఏమీ వద్దు!" అతను జంతువే అయిపోయాడు! వర్ధనాన్ని లేవకుండా, కదలనీకుండా బలవంతంగా నొక్కిపడుతూ, జాకెట్టు పర్ మని చించేసాడు. చీర లాగేశాడు. ఇంకా కూడా లాగేయబోతూంటే వర్ధనం ఒక్కవూపున కాళికలా లేచింది. మురళి దబ్బున పడిపోయాడు నేలన. వర్ధనం అతన్ని లేపి మరీ ఈ చెంపా ఆ చెంపా టపటపా వాయించేసింది.

"ఛీ! దుర్మార్గుడా! నిన్ను అన్నం పెట్టి, ఆదరించినందుకు నాకు ఇదా నువ్విచ్చే ప్రతిఫలం?! ఫో! నీ పెళ్ళాం మీద పడు! వూరివాళ్ళమీద కాదు!! నీ దాహం చల్లారుతుంది! ఆ మనిషి నిన్ను మగాడిగా మొగుడిగా చూస్తుంటుంది!"......

మురళి సిగ్గుతో కుంచించుకుపోతూ గోడకి అతుక్కుపోయి నిలబడ్డాడు, తలొంచుకుని.

వర్ధనం చీరె తీసి కట్టుకుంది. ఆ భుజాలమీంచి చీరచెంగు కప్పుకొని అతని దగ్గరగా వెళ్ళి "విడాకులు కావాలా? ఎందుకూ? యిందుకా? అచ్చోసిన ఆంబోతులా అందరు ఆడాళ్ళమీదా పడ్డానికా, విడాకులు?! ఇవ్వదు నీ పెళ్ళాం! ఏమనుకుంటున్నావో! కట్టుకున్న ఏ భార్యా అంత తేలిగ్గా విడాకులివ్వదు! ఇప్పటికైనా పోయి నీ పెళ్ళాం కొంగట్టుకున్నావా సరి!లేకపోతేనిన్నింకా ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ళు తాగిస్తుంది తెల్సుకో!!"

మురళి తల ఇంకా వొంగిపోయింది.

"ఇంకా నిలబడ్డావేం?! దొంగ

వేషాలేస్తున్నావేం? నాకు మీ మగాళ్ళ మీద నమ్మకం ఏడాది క్రిందటే పోయింది. అందుకే నా మొగుడు కాంపుకి వెళ్ళాడని చెప్పాను.... అయినా నీ జంతు బుద్ధి చూపించుకున్నావు!..."

మురళి ఆశ్చర్యంతో తలెత్తి గొంతు కూడదీసుకుని "అయన..." గొణిగేడు.

వర్ధనం విసురుగా "ఆఁ ... ఆ మహానుభావుడు వెళ్ళింది కాంపుక్కాదు.. దేశంమీదికి. ఇల్లు, ఇల్లాలు ... అంతా వొదిలేసి పోయేడు...ఏడాది క్రితం... నాకు తెలియక అడుగుతాను., పెళ్ళాల్ని వదిలి పారిపోడానికి, మీకు పెళ్ళెళ్ళెందు కయ్యా అయితే?" రౌద్రంగా అంది. వర్ధనంలో ఇందాకటికీ, ఇప్పటికీ ఎంత తేడా?! అప్పుడెంత సౌమ్యమూర్తి! ఇప్పుడెంత రుద్రమూర్తి!?

మురళి గబగబ తన బట్టలు వేసుకుని బాగ్ పట్టుకున్నాడు.

"ఒక్క సందేహం...నువ్వు నువ్వ యితే, ఎలా యిప్పుడు?"

వర్ధనం విసుగ్గా నవ్వి, "మొగుడు వదిలి పారిపోతే బతకలేననుకున్నావా? నా పియ్యూసీ, టైపు సర్టిఫికేట్లు నాకు న్నాయి. ఇదిగో పెళ్ళాం లేకపోతే గతి లేనట్టు మీరు వూరిమీద నీచంగా పడ్తారు గాని, మా కా పాడు కక్కుర్తి వుండదు! ఎలాగో గౌరవంగా మా బతుకు మేం బతక్కపోము!"

మురళి పరిగెత్తినట్టే నడిచేడు.

* * *

"అయితే ఆ తర్వాత ఏమైంది? మురళి కాపురం?" ఆత్రంగా అడిగేడు రమణమూర్తి నన్ను.

ఆ గదిలో నేనూ, రమణమూర్తి కుర్చీల్లో కూచుని వున్నాం. మా ముందు టేబిలుమీద సిగరెట్ పాకెట్లు, అగ్గిపెట్టె, కథ రాసిన కాయితాల దొంతర, వాటి మీద పేపరు వెయిటు, పెన్ను, ఆ ప్రక్కన పొడుగాటి కవర్లు కొన్ని వున్నాయి. ఫ్లాస్కు కూడా వుందక్కడ.

నే నిటీవల రాసిన కథ మిత్రుడికి ఇంతసేపూ, చదివి వినిపించేను. ఎండింగు ఇంకా రాయలేదు. మూర్తి సిగరెట్టు నోట్లోది ఆఖరి పీల్పు పీల్చి యాష్ ట్రేలో పడేసి, వెంటనే ఇంకోటి అంటిస్తూ, మళ్ళా అడిగేడు. "చెప్పు కృష్ణా? లాస్ట్‌కి ఏమౌతుంది?"

ఫ్లాస్కు తెరిచేను. లేచి కిటికీలో వున్న రెండు గాజు గ్లాసులు తీసి, ఫ్లాస్కులో కాఫీ గ్లాసుల్లో వొంపాను. యింతసేపూ సస్పెన్స్‌తో మూర్తి యాంగ్జయిటీగా పీలవడం గమనిస్తు న్నాను! నవ్వుతూ నేనో గుక్క తాగి, అతని గ్లాసు జరిపి, "చెప్పు? నువ్వు? ఆఖరికేమౌతుందో? నా కథంతా విన్నావు గదా సరిగ్గా?" అన్నాను.

మూర్తి కాఫీ గబగబా తాగేసి "ఇదిగో నీ కథ ప్రకారం అయితే ఆ మురళి చచ్చినట్టు ఏలుకుంటాడు భార్యని,

వర్ధనం ఇంట్లో జరిగిన ఇన్సిడెంటుకి!!.." అన్నాడు.

"అలా జరగాలి! అలా అయితేనే సహజంగా వుంటుంది. కథ ..." అన్నాడు మురళి.

"అవును ... కథలో అయితే ఆ ఎండింగు సహజంగా వుంటుంది. కథకి న్యాయం చేకూరుతుంది. ఏం?"

నా మాటకి మూర్తి "అదేం? అలా అంటున్నావ్? నువ్వు ఇంకొకలా ఎండ్ చేద్దామనుకుంటున్నావా?" అడిగేడు ఆశ్చర్యంతో.

"నేను రాస్తోన్నది కథ కాదు ... జీవితం! అందుకని జీవితంలాగే ముగింపు ఇస్తాను..." అన్నాను నా ఖాళీగ్లాసు టేబిలు మీదుంచి.

మూర్తి మరింత ఆశ్చర్యంతో "కథ కాదూ?! ఎవరి జీవితం అదయితే?" అడిగేడు.

"చెబుతాను ... ముందు మురళి గురించి చెప్పనీ! అతను భార్యని ఏలుకుంటాడనీ, మారిపోయాడనీ కదూ అన్నావ్? లేదు...మురళి వర్ధనం ఇంటి నుంచి వెళ్ళాక భార్యని మరింత ద్వేషించేడు..."

"ఆఁ!?"

"గీత విడాకులివ్వకపోయినా, అతను మట్టుకు గీతని ఏలుకోలేదు ...... ఆ వూర్నించి వెళ్ళిపోయి, ఒక్కడూ ఓ వూళ్ళో, ఓ చోట ట్యూషన్స్ చెప్పుకొంటూ, కథలు రాసుకుంటూ జీవితాన్ని దొర్లించేస్తున్నాడు నిర్లిప్తంగా..."

మూర్తి కళ్ళు విప్పార్చి "అయితే?" అని నన్ను చూస్తూ ఆగిపోయేడు.

"ఆ వూరినీ, ఆ వుద్యోగాన్నీ, భార్యనీ అందర్నీ అన్నిటినీ పరిత్యజించేసి, వెళ్ళిపోయి ఇక్కడిలా..."

"నువ్వేనా అయితే, కృష్ణా? మరి మురళి...?"

"నా పూర్తిపేరు మురళీకృష్ణ ... కొందరితో బాటు, సగం పేరు నే వదిలేసేను...నీతో పరిచయం అయ్యాక ఈ రెండేళ్ళలో ఒక్కమారూ నా కథ నీకు చెప్పలేదుగదూ? నిన్న ఎందుకో నా పాత జీవితం కళ్ళముందు మెదలిందోయ్! పడుకున్న టైములో ... కాయితాలమీద పెట్టాలనుకున్నాను..."

మూర్తి సందేహంగా, "అయితే మీ..." అన్నాడాగిపోతూ.

"వాళ్ళంతా ఏమయ్యారో తెలుసుకునే ప్రయత్నం చెయ్యలేదు. ఆ అవసరం నాకు లేదు..." నా గొంతులో మార్పుని చూసి మూర్తి జంకి, కుర్చీలోంచి లేచేడు.